# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

ప్రెస్ విజ్ఞప్తి

20 సెప్టెంబర్ 2014

### అర్జున్ రాజకీయ పతనం మరియు లొంగుబాటుపై

2005 నుండి మా పార్టీ డికె ఎస్‌జడ్‌సి మరియు ఎస్‌యంసి సభ్యుడిగా ఉండిన అర్జున్, పశ్చిమ బస్తర్ డివిసి కార్యదర్శి వర్గ సభ్యురాలైన తన సహచరి రణితతో కలసి రాజకీయ పతనానికి గురై 14 జులైన చెప్పా పెట్టకుండా పార్టీని వదలి పారిపోయి జులై నెలలోనే తెలంగాణ రాష్ట్ర డిజిపి ముందు లొంగిపోయాడు. నేటి కఠిన పరిస్థితులలో ప్రజలు మరియు కేడర్ల విశ్వాసానికి తూట్లు పొడుస్తూ శత్రువు ముందు మోకరిల్లి అర్జున్ విప్లవోద్యమానికి తీరని నష్టం చేకూర్చిన వాడయ్యాడు. అర్జున్ మరియు రణితల పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఎస్‌జడ్‌సి వారిని పార్టీ నుండి బహిష్కరిస్తోంది. నిరంతరం పెరుగుతూన్న ఆపరేషన్ గ్రీన్ హంట్ క్రూర దాడుల మధ్య అర్జున్ లొంగుబాటుపై ప్రకటన విడుదల చేయడం, అందుకు సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచడంలో జరిగిన ఆలస్యానికి చింతిస్తున్నాం.

1990లో పార్టీలో భర్తీ అయిన వెంటనే అర్జున్ దండకారణ్యంలో కాలు మోపాడు. 1993 నుండి మిలటరీ ఫ్రంట్‌లో పనిచేస్తూ వచ్చిన అర్జున్ దళ కమాండర్‌గా, కంపనీ పార్టీ కమిటీ సభ్యుడిగా, కంపనీ-1 కమాండర్‌గా, మొమిస్ - మొబైల్ మిలటరీ స్కూల్ బాధ్యుడిగా వివిధ బాధ్యతలను నిర్వరిస్తూ వచ్చాడు. ఫిబ్రవరి 2014లో జరిగిన ఎస్‌జడ్‌సి 10వ సమావేశంలో అర్జున్‌కు బెటాలియన్-2 కమాండర్‌గా, బెటాలియన్ పార్టీ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు ఇచ్చాం. ఉన్నత స్థాయి ఫార్మేషన్ బాధ్యతలు అప్పగించిన ఆరు నెలలలోపే అర్జున్ చేతులు ఎత్తేశాడు. కమ్యూనిస్టు విప్లవకారులకు విప్లవోద్యమ విజయం పట్ల, విప్లవ ప్రజానీకం గొప్ప శక్తిపై అచంచల విశ్వాసం ఉండాలి. పూర్తి ఆత్మవిశ్వాసంతో విప్లవ కార్యాచరణలో పాల్గొనాలి. నేడు దండకారణ్య, దేశ విప్లవోద్యమం కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ, అనేక సవాళ్లతో తలపడుతూ, శత్రువు విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని ఎదుర్కొంటూ ముందడుగు వేస్తున్నది. ఈ కఠిన పరిస్థితులను చూసి, శత్రు బలాన్ని, వాడి దాడుల తీవ్రతను అతిగా అంచనా వేసుకోవడమే కాకుండా, దాన్ని ఓడింప వీలులేనిదిగా భావించిన అర్జున్ గుండె జారిపోయింది. దేశీయ ప్రపంచ పరిస్థితులు మున్నెన్నటికంటే కూడా విప్లవానుకూలంగా మారుతున్న క్రమాన్ని చూడలేకపోయిన అర్జున్ ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. విప్లవోద్యమం, విప్లవ ప్రజానీకంపై విశ్వాసం కోల్పోయాడు. సామాజిక అభివృద్ధి క్రమాన్ని అర్థంచేసుకోలేక పోవడంతో విప్లవ ప్రజాయుద్ధం పురోగమించే క్రమంలో విప్లవ శక్తుల, శత్రు బలాబలాల మధ్య జరిగే మార్పులని, ఎగుడు-దిగుడులను, వంకర-టింకరగా సాగే ప్రయాణాన్ని, గెలుపు-ఓటమి అంతిమంగా గెలుపు ప్రక్రియ గుండా సాగే విప్లవ మార్గానికి సంబంధించిన మార్క్సిస్టు దృక్పథం లోపించిన కారణంగా అర్జున్‌లో నిరాశావాదం పెరిగి విప్లవోత్సాహం చల్లబడింది. వ్యక్తి స్వార్థం పెరిగి త్యాగనిరతి కొరవడింది. ఈ రాజకీయ బలహీనతనే అర్జున్ రాజకీయ పతనానికి కారణమైంది. ప్రజలే చరిత్ర నిర్మాతలు, ప్రజాయుద్ధంలో అంతిమ విజయం ప్రజలదే అనే చారిత్రక సత్యాన్ని అర్జున్ అర్థం చేసుకోలేక పోయాడు.

నిర్మాణ, సైనిక సమస్యలను పరిష్కరించడంలో అర్జున్ దీర్ఘకాలం నుండి లోతైన ఉదారవాదానికి గురయ్యాడు. తన విప్లవాచరణలో ముందుకు వచ్చిన ఉదారవాదానికి వ్యతిరేకంగా కమిటీ ఎప్పటికప్పుడు పోరాడుతూ వచ్చినప్పటికీ వాటి నుండి తనను బయటపడేయాడానికి అది సరిపోలేదు. అర్జున్ విప్లవాచరణలోని, పని విధానంలోని తీవ్రమైన ఉదారవాదంతో పాటు దండకారణ్య విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఎస్‌జడ్‌సి సభ్యునిగా ప్రజల, కేడర్ల పట్ల తన బాధ్యతను దృఢంగా, చివర శ్వాస వరకు నిర్వర్తించే స్థాయికి తన రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవడంలో అర్జున్ వ్యక్తిగత పాత్ర చాల బలహీనంగా ఉంది.

ఉదారవాదం కారణంగా మారుతున్న పరిస్థితులు డిమాండ్ చేస్తున్న మేరకు తన మానసిక సంసిద్ధతను, పోరాట మనస్తత్వాన్ని, పోరాట స్ఫూర్తిని, తన దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవడం పట్ల అర్జున్ ఉదాసీనంగా వ్యవహరించాడు. పార్టీ వ్యూహాత్మక నాయకత్వంగా కార్మికవర్గ అగ్రగామిదళానికి ఉండవలసిన దృఢసంకల్పం అర్జున్‌లో లోపించింది. లొంగుబాటుకన్నా పోరాడి మరణించడమే గొప్ప అనే స్ఫూర్తితో చివరి శ్వాస వరకు విప్లవోద్యమంలో, ప్రజాసేవలో కొనసాగడానికి బదులు అర్జున్ స్వార్థ బుద్ధితో కమ్యూనిస్టు విలువలకు, ఆదర్శాలకు తిలోదకాలు ఇచ్చి, త్యాగానికి వెరిసి శత్రువు ముందు మోకరిల్లాడు. ఏ దోపిడి పాలకవర్గాలకు వ్యతిరేకంగా రెండు దశాబ్దాలకు పైగా పోరాడుతూ వచ్చాడో నేడు వాటి ఎంగిలి మెతుకులపై బతకడానికి సిద్ధపడి, వారి శరణలోకి వెళ్లడం అసహ్యకరమైనదీ, ఖండించదగినదీ మాత్రమే కాదు ప్రతి నిమిషం, ప్రతి చోటా, ప్రతి స్థాయిలోనూ నిరసించదగిన నికృష్ట పని.

అర్జున్ సహచరి రణిత పార్టీ వదలి వెళ్లేనాటికి పశ్చిమ బస్తర్ డివిసి కార్యదర్శివర్గ సభ్యురాలిగా ఉండిన సీనియర్ ఆదివాసీ మహిళా కామ్రేడ్. తనలో వ్యక్తివాదం, వ్యక్తిగత పనివిధానం, పెత్తందారీ ధోరణి మొదలైన కార్మికవర్గ వ్యతిరేక ధోరణులతో పాటు వర్గపంథాకు సంబంధించిన లోపభూయిష్టమైన అవగాహన ఉండింది. 2012లో జరిగిన డివిజన్ ప్లీనం తనకు హెచ్చరిక చేసింది. తర్వాత కూడ తన సమస్యలు యధావిధిగా కొనసాగాయి. తను 2012లోనే పార్టీ వదలి పోవడానికి తయారైంది. అయితే అపుడు అర్జున్ అర్థం చేయించడంతో ఆగింది. తను ముందు నుండే ఊగిసలాడుతుండడంతో అర్జున్ తను పార్టీ వదలిపోవడానికి నిర్ణయించుకోవడంతో ఇద్దరు కలసి పారిపోయారు.

అర్జున్ తన చివరి ఉత్తరంలో పార్టీకి ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతూ లొంగుబాటు తర్వాత పార్టీ రహస్యాలన్నింటినీ శత్రువు ముందు వెల్లడించిండు. చెప్పకుండా పారిపోయిన వారి నుండి నిజాయితీని ఆశించలేము. మొమిస్ నుండి బెటాలియన్–2కు బదిలీ, బూటకపు సంస్కరణల పట్ల పార్టీ చేబట్టిన వైఖరి, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేమి మరియు తన అనారోగ్యాన్ని లొంగుబాటుకు కారణాలుగా అర్జున్ చెప్పిండు. ఉద్యమ అవసరాలు, కేడర్ల సమర్థతలను దృష్టిలో పెట్టుకొని పార్టీ ఎవరినైనా, ఎక్కడికైనా, ఎపుడైనా బదిలీ చేస్తుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. సాధారణ పార్టీ సభ్యులు, దళ సభ్యులు కూడా బదిలీపై ఇతర జోన్‌లకు, రాష్ట్రాలకు సంతోషంగా వెళుతున్నారు. ఆర్గనైజేషన్, మిలట్రీ, ఐక్య సంఘటన, వివిధ డిపార్ట్‌మెంట్లలో బదిలీలు సాధారణ విషయం. ఎస్‌జడ్‌సి స్థాయిలో బదిలీని పార్టీ వదలిపెట్టడానికి, లొంగుబాటుకు కారణంగా చెప్పడం అర్జున్ దివాళాకోరుతనాన్నే తెలియజేస్తుంది. వాస్తవానికి ప్రస్తుత కఠిన పరిస్థితుల్లో శారీరకంగా మరియు మానసికంగా ఎక్కువ శ్రమించడానికి అర్జున్ సిద్ధంగా లేడు.

'సంస్కరణల ఫలితాలు ప్రజలకు చెందాలి, పార్టీ వీటిని అడ్డుకుంటోంది' అని అర్జున్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నాడు. బూటకపు సంస్కరణలపై పార్టీకి స్పష్టమైన పాలసీ ఉంది. వేర్వేరు ప్రాంతాలలో అక్కడ విప్లవోద్యమ నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి సంస్కరణలతో ఎస్‌జడ్‌సి వ్యవహరిస్తోంది. బూటకపు సంస్కరణల వెనుక గల దోపిడీ పాలకవర్గాల కుట్ర మనకు సుపరిచితమే. అయినప్పటికీ ఈ విషయంలో ఇంకా భేదాభిప్రాయాలేమైనా ఉండి ఉంటే పార్టీ కమిటీ సమావేశాల్లో, ప్లీనాల్లో అర్జున్‌కు చర్చించే అవకాశం ఉండింది.

తెలంగాణ ఏర్పాటుతో సంతృప్తి చెంది జనజీవన స్రవంతిలోకి తిరిగి వెళ్లినట్లుగా అర్జున్ ప్రకటించడం మౌలిక ఉద్దేశ్యాన్నుంచి తను పక్కదారి పట్టడమే. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేయడమే పార్టీ ప్రకటిత లక్ష్యం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 1995నుండే మా పార్టీ స్పష్టంగా ప్రజాస్వామిక తెలంగాణ సాధన లక్ష్యాన్ని ముందుపెట్టి ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వస్తున్నది. భౌగోళిక తెలంగాణతో ఏ విధమైన విప్లవ లక్ష్యాలు పరిపూర్తి కావు. ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావు.

పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని అర్జున్ దుష్ప్రచారానికి లంకించుకున్నాడు. పార్టీ ఆర్గనైజేషన్‌ను నడిపించే నియమం కేంద్రీకృత ప్రజాస్వామ్యం. పార్టీ వివిధ స్థాయిల్లోని వేదికల్లో – సమావేశాలు, ప్లీనాలు, కాన్ఫరెన్సులు మరియు కాంగ్రెస్‌ల్లో వివిధ విషయాలపై స్వేచ్ఛగా చర్చలు జరిగి ఏకాభిప్రాయంతో లేదా మెజారిటీతో నిర్ణయాలు చేయబడతాయి. పార్టీ వదలే వరకు అర్జున్ కూడ ఈ ప్రక్రియలో భాగస్వామే.

అనారోగ్య విషయానికి వస్తే కమ్యూనిస్టు విప్లవకారుల్లో ప్రాణాలున్నంత వరకు ఉద్యమానికి, ప్రజలకు సాధ్యమైనంత సేవ చేయాలనే విప్లవ చేవ, పట్టుదల ఉండాలి. విప్లవోద్యమంలోనే, పోరాట ప్రజానీకం మధ్యనే చావైనా రేవైనా తేల్చుకోవాలనే అవగాహన కల్గియుండాలి.

అర్జున్ లొంగుబాటు విప్లవోద్యమానికి నెగెటివ్ గుణపాఠం. పార్టీ చేబట్టిన బోల్షివీకరణ కేంపెయిన్‌ను మరింత దృఢంగా కొనసాగించాల్సిన అవసరాన్ని, కఠిన పరిస్థితులను ఎదుర్కోడానికి అవసరమైన పోరాట సామర్థ్యాన్ని పెంపొందించుకోవలసిన అవసరాన్ని యీ లొంగుబాటు గుర్తింపచేస్తున్నది. రాజీలేని పోరాట స్ఫూర్తి, లక్ష్యం పట్ల అంకిత భావంతో చివరి శ్వాస వరకు ఉద్యమంలో కొనసాగే విప్లవ నిబద్ధతను ప్రతి కమిటీ సభ్యునిలో పెంపొందించాల్సిన అవసరాన్ని ఎస్‌జడ్‌సి ఈ సందర్భంగా గుర్తిస్తున్నది. ఈ దిశలో ముందుకు వెళతానని హామీ ఇస్తున్నది.

గుడ్సా ఉసెండి
అధికార ప్రతినిధి
దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)